క్లుప్తంగా

నేడు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

ఆలమూరు: గ్రామంలో పశుసంవర్ధకశాఖ కార్యాలయం ఆవరణలోని పశువుల ఆస్పత్రిలో మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు ఏడీ ఎల్.అనిత తెలిపారు. నాలుగు నెలల వయసు కలిగిన లేగదూడ నుంచి చూడి పశువుల వరకూ ఈ టీకాలను వేయనున్నామన్నారు. పాడి రైతులంతా ఈశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

వైభవంగా బేతాళ స్వామి కలశ స్థాపన



అంబాజీపేట సెంటర్‌లో చెడీ తాలింఖానా చేస్తున్న యువకులు

అంబాజీపేట: విజయదశమి శరన్నవరాత్రులను పురస్కరించుకుని అంబాజీపేట, మాచవరం శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే విజయ బేతాళ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి కలశస్థాపన నిర్వహించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ చైర్మన్ శీలం సత్యఅర్జున మోహనరావు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో మాచవరం దుర్గాక్షేత్రం రామ్‌ఘాట్ వద్ద నుంచి అఖండ దీపాన్ని ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఊరేగించారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్‌లో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ప్రదర్శనలో చెడి తాలింఖానా, తీన్‌మార్ డాన్సులతో బేతాళ స్వామిని ఊరేగించి పెద్ద వీధిలోని ఆలయంలో ప్రతిష్ఠించారు. అంబాజీపేట పశువుల మార్కెట్, కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

నూకాంబిక ఆలయ ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం

ఆలమూరు: మండలంలోని ప్రసిద్ధ దేవాలయంగా ప్రఖ్యాతి గాంచిన నూకాంబిక అమ్మవారి ఆలయం ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం జరిగింది. స్థానిక ఆలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ధర్మకర్తల చైర్మన్ వీరి అప్పారావు నేతృత్వంలో సభ్యులతో ఈఓ ఉండవల్లి వీర్రాజు చౌదరి ప్రమాణం చేయించారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

మామిడికుదురు: స్థానిక ప్రభుత్వ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9,10 తరగతుల విద్యార్థులకు సోమవారం ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చారు. పీఎంశ్రీ పథకంలో భాగంగా 2025–26 విద్యా సంవత్సరంలో ఈ స్కూల్లో వృత్తి శిక్షణ కోర్సుల్లో భాగంగా రిటైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ కోర్సులు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా దసరా సెలవుల్లో మామిడికుదురులోని పలు షాపుల్లో పదో తరగతి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చారు. స్కూల్ హెచ్‌ఎం బి.చిరంజీవిరావు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం డి.సత్యనారాయణ, వృత్తి శిక్షణ ఉపాధ్యాయులు వై.మధు, జె.మోనికా కృష్ణ, పి.సత్యశ్రీ పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

దోమల నిర్మూలనకు మందు పిచికారీ

మామిడికుదురు: దోమల వ్యాప్తి కారక లార్వా నిర్మూలన చర్యల్లో భాగంగా సోమవారం మగటపల్లి గ్రామంలో ఎబేట్ మందు పిచికారీ చేయించారు. గ్రామంలోని ఎస్టీ కాలనీ, కండెళ్ల మెరక, జెడ్పీహెచ్ స్కూల్ రోడ్డు తదితర ప్రాంతాల్లోని మురుగు నీటి గుంటలు, పల్లపు ప్రాంతాల్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఎబేట్ మందు పిచికారీ చేశారు. సర్పంచ్ సూరిశెట్టి లక్ష్మి ఆధ్వర్యంలో కార్యదర్శి పరమేశ్వరి పర్యవేక్షణలో జరిగిన ఎబేట్ పిచికారీలో ఏఎన్‌ఎం రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాచార్యులు, శ్రీను పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత

రాజోలు: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు చేయూతనందిస్తున్న ఆల్ ఇండియా స్టూడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఎస్‌డబ్ల్యూఏ) సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. నియోజకవర్గంలోని పలు విద్యాసంస్థల్లో విద్య అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు అందించారు. ఫీజులు కట్టుకోలేని వారికి ఆర్థికంగా చేయూతనిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్ తెలిపారు. న్యాయవాది దేవ రాజేంద్రప్రసాద్, నల్లి చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

పి.గన్నవరం: స్థానిక బీవీఆర్ కాంప్లెక్స్‌లో అబ్దుల్‌కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం స్వాస్థ్ నారీ– సశక్తి పరివార్‌లో భాగంగా కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి నేతృత్వంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 40 మందికి ఉచితంగా ఆపరేషన్లకు రిఫర్ చేశారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.రాఘవేంద్ర రావు, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, కొక్కిరి రవికుమార్, మామిళ్లపల్లి శ్రీనివాసరావు, కోట రాజేంద్రప్రసాద్, గూటం శ్రీనివాసరావు, చెల్లుబోయిన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీ నమోస్తుతే..

- వైభవంగా శరన్నవరాత్రులు ప్రారంభం
- గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కొత్తపేట: దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామగ్రామాన కనకదుర్గాదేవి ఆలయాలు, గ్రామదేవతల ఆలయాలు, శరన్నవరాత్ర పందిళ్లలో కనకదుర్గాదేవిని ప్రతిష్ఠించి విశేషంగా అలంకరించారు. సోమవారం శుభ ముహూర్తాన ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బొరుసువారిసావరం విజయ కనకదుర్గాదేవి ఆలయంలో బొరుసు వెంకట ఉదయభాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. భాస్కర్–వసుధ దంపతులు పూజలు నిర్వహించారు. వాడపాలెం జ్ఞాన సరస్వతీదేవి అమ్మవారి ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ బండారు బులితాత, ఆలయ ఇన్‌చార్జ్ మట్టా బాబ్జి, సభ్యుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు, చండీ యాగ మహోత్సవాలు ప్రారంభించారు. స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో కమిటీ అధ్యక్షుడు కోట్ల ప్రభాకరవిశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో, ఏనుగులమహల్ శ్రీరాజరాజేశ్వరీదేవి (శ్రీచక్రమహామేరు యంత్రం) ఆలయంలో ఆలయ ట్రస్టీ సాదు పుల్లయ్య తదితరుల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు ప్రారంభించారు. కొత్తపేట, వానపల్లి గ్రామదేవతలు బంగారమ్మ, పళ్లాలమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు ప్రారంభించారు.



జి.సావరంలో బాలాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు



తాటికాయలవారి పాలెంలో..



అయినవిల్లిలో..

మామిడికుదురులో..

మామిడికుదురు: శ్రీదేవీ శరన్నవరాత్ర ఉత్సవాలకు సోమవారం అంకురార్పణ జరిగింది. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి శుభ ముహూర్తాన అమ్మవారి ఆలయాల్లో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో మహాలక్ష్మి అమ్మవారికి చక్రార్చన, పంచామృతాభిషేకం, మహాలక్ష్మీ యాగం, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణ పూజలను ఘనంగా జరిపించారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మ ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాలకు శింగంశెట్టి సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు కలశ స్థాపన చేశారు. ఆలయంలో అమ్మవారు శైలపుత్రి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురు విజయదుర్గమ్మను చామంతి పూలతో విశేషంగా అలంకరించారు. పాశర్లపూడిబాడవ ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన మహోత్సవాలకు కలశ స్థాపన జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాల వద్ద పలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మలికిపురంలో..

మలికిపురం: మండలంలో సోమవారం దసరా ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దాదాపు అన్ని గ్రామాల్లోనూ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఆయా కమిటీలు ఏర్పాటు చేశాయి. మలికిపురం టాక్సీ స్టాండ్‌తో పాటు ప్రధాన మార్కెట్ వద్ద, విశ్వేశ్వరాయపురం, కత్తిమండ, లక్కవరం, బట్టేలంక, రామరాజులంక తదితర గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు లడ్డూలను ఏర్పాటు చేశారు.

రాజోలులో..

రాజోలు: విజయదశమి ఉత్సవాలు పురస్కరించుకుని మండలంలోని పలు కనకదుర్గమ్మ వారి ఆలయాల్లో విజయదశమి పూజలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. తాటిపాక, రాజోలు, పొదలాడ, సోంపల్లి, శివకోటి, చింతలపల్లి, పొన్నమండ గ్రామాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో అమ్మవారికి సహస్ర నామార్చన, కుంకుమపూజలు నిర్వహించారు. రాజోలు భారం వారి కనకదుర్గ ఆలయం, పొదలాడ లాకు వద్ద ఆలయంలో మహిళలు విష్ణుసహస్ర పారాయణ, లలితా సహస్ర పారాయణ చేశారు. తాటిపాకలోని కనకదుర్గ ఆలయంలో రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మండపేట ఇన్‌చార్జి కటకంశెట్టి ఆదిత్య, ప్రచార విభాగం అధ్యక్షుడు మద్దుల కాసు, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో దేవీ నవరాత్ర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. నవరాత్రి తొలిరోజు దుర్గాదేవి అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ మండపాల్లో నెలకొల్పిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు పంచారు. ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో దేవీ నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామ శివారు తాటికాయల వారిపాలెంలో వేంచేసిన కనకదుర్గమ్మ వారి ఆలయంలో కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పి.గన్నవరానికి చెందిన దాసరి కాశి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అంబాజీపేట–గన్నవరం రోడ్డులో లక్ష్మీ కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకుని కుంకుమార్చనలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి దూనబోయినవారిపాలెం వద్ద కొలువైన కనకదుర్గమ్మవారు నవరాత్రుల్లో భాగంగా తొలిరోజైన సోమవారం బాలత్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో కొలువైన అన్నపూర్ణాదేవి అమ్మవారు, ముక్తేశ్వరంలో క్షణముక్తేశ్వరస్వామి ఆలయంలో కొలువైన ముక్తికాంత అమ్మవారు ఇలా మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లు బాలాత్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.

అంతర్వేది గుర్రాలక్క ఆలయంలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి వారి సోదరి అశ్వరూఢాంబిక (గుర్రాలక్క) ఆలయంలో సోమవారం విజయదశమి పూజలు ప్రారంభమయ్యాయి. అర్చకస్వాములు స్వామి వారి తరుపున అశ్వరూఢాంబ అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఆలయం వద్ద అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మడికిలో..



మలికిపురంలో అమ్మవారి విగ్రహం వద్ద భక్తుల పూజలు



అప్పనపల్లిలో మహాలక్ష్మీ అమ్మవారికి నిర్వహిస్తున్న పూజలు



తాటిపాక కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న కోఆర్డినేటర్ గొల్లపల్లి



అంతర్వేదిలో అమ్మవారికి చీర, సారె సమర్పిస్తున్న ఆలయ అధికారులు

కూటమి వైఫల్యాలను ఎండగడదాం

కొత్తపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగడదామని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని గంటి గ్రామ పార్టీ గౌరవాధ్యక్షుడిగా సర్పంచ్ సాగి బంగార్రాజు, అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ మట్టపర్తి వెంకట్రావు, అనుబంధ విభాగాల అధ్యక్షులుగా యువజన విభాగానికి గారపాటి చంద్రశేఖరరెడ్డి, రైతు విభాగానికి కుసుమే వెంకటేశ్వరరావు, మహిళా విభాగానికి గూనపాటి ప్రసన్న, సోషల్ మీడియా విభాగానికి యన్నపు నందివరప్రసాద్, బీసీ విభాగానికి దొంగ సత్యప్రసాద్, ఎస్సీ విభాగానికి సాకా శ్రీను, విద్యార్థి విభాగానికి ఉండు నరేష్, బూత్ కమిటీకి భూపతిరాజు సత్యనారాయణరాజు నియమితులయ్యారు. రావులపాలెం మండలం గోపాలపురంలో వారు జిల్లా పార్టీ అధ్యక్షుడు జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, కృతజ్ఞతలు తెలియజేశారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు సముచిత గౌరవం లభిస్తుందని, అందరూ ఉత్సాహంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి పాలన తేటతెల్లమైందని, ఏడాదిలోనే ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను చవిచూస్తోందన్నారు.



గోపాలపురంలో పార్టీ పదవులు పొందిన నేతలను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి చర్యలు

రాజోలు: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనల మేరకు బూత్ కమిటీల నియామకం పూర్తి చేశామని మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం తాటిపాకలో ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి స్వగృహం వద్ద నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షుడు, ముఖ్య నాయకులతో గొల్లపల్లి సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని బూత్ కమిటీలను నియామకం పూర్తి చేసిన మండల పార్టీ అధ్యక్షులను గొల్లపల్లి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా కుంటుపడిపోయాయని ఆరోపించారు. రైతుల పక్షాన నిలిచేందుకు రైతుపోరుబాట, మెడికల్ కళాశాలను ప్రైవేటుపరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాలను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయడాన్ని అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే విధంగా కృషి చేయాలని కోరారు. రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, అడబాల బ్రహ్మాజీ, కుసుమ సత్యనారాయణ, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, పార్టీ అధికార ప్రతినిధులు ఉచ్చుల విష్ణు, గుర్రం జాషువా, తాడి సహదేవ్, గుబ్బల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



బూత్ కమిటీల నివేదికను గొల్లపల్లికి అందిస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు

కష్టపడే వారినే గ్రామ కమిటీల్లో నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: పార్టీ కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలను గ్రామ, అనుబంధ కమిటీల్లో నియమించాలని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గ్రామశాఖల అధ్యక్షులకు సూచించారు. పోతవరంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం మండల పార్టీ యన్నాబత్తుల ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గన్నవరపు మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలందరికీ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో ఇన్సూరెన్స్ చేయించే కార్యక్రమం ప్రారంభించనున్నారన్నారు. రాష్ట్ర నాయకుడు దొమ్మేటి వెంకట శివరామన్, మండల ప్రధాన కార్యదర్శులు కుడుపూడి రాము, చింతా రవి, గుర్రం స్వామి నాయుడు, కొంబత్తుల శేఖర్, నాయకులు మట్టపర్తి పండు, గుత్తుల మధు, పుచ్చకాయల నర్సింహమూర్తి, కొల్లే సూర్యనారాయణ పాల్గొన్నారు.

మహిళలకు రేపు ప్రత్యేక వైద్య శిబిరం

పి.గన్నవరం: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో బుధవారం ఉదయం స్వాస్థ్–నారీ సశక్తి పరివార్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాఘవేంద్రరావు తెలిపారు. మహిళలకు రక్తపోటు, సుగర్, నోరు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పరిసర గ్రా మాలకు చెందిన మహిళలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాఘవేంద్రరావు విజ్ఞప్తి చేశారు.

కోకో మొక్కలు పెంచేలా ప్రోత్సహించాలి

అంబాజీపేట: రైతులు ఆర్థికాభివృద్ధి చెందేలా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించేలా కోకో పెంచేలా ప్రోత్సహించాలని ఉపాధి హామీ పథకం పీడీ డి.రాంబాబు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఏపీఓ ఎఎస్‌వీ కృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పీడీ రాంబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కొబ్బరి తోటలో అంతర పంటగా కోకో పంటను పెంచేలా కృషి చేయాలన్నారు. మినీ గోకులం షెడ్లు నిర్మించుకునే అర్హులైన లబ్ధిదారులతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. శానిటేషన్‌లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటికో కంపోస్టు పిట్ తవ్వడానికి ప్రచారం చేయించాలన్నారు. ఇంటి ఆవరణలో చెత్తను కంపోస్టు పిట్‌ను తయారు చేసే విధానాన్ని వివరించాలన్నారు. సేంద్రియ ఎరువు తయారై రైతులకు ఉపయోగపడుతుందనే విషయాన్ని వివరించాలన్నారు. అనంతరం క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. సమావేశంలో ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, జూనియర్ ఇంజినీర్ పి.వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో క్షేత్ర పరిశీలన చేస్తున్న పీడీ రాంబాబు

మహిళల ఆరోగ్య భద్రత ముఖ్యం



మడికిలో గర్భిణులకు సీమంతాలు నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



నగరంలో నిర్వహిస్తున్న సామూహిక సీమంతాలు

ఆలమూరు: మహిళలు ఆరోగ్యంతో ఉంటే ఆ కుటుంబమంతటికీ తగిన భద్రత ఉంటుందని కొత్తపేట ఏడీఎంహెచ్ఓ ఎం.సుమలత అన్నారు. మండలంలోని మడికి, కలవచర్ల గ్రామాల్లో సోమవారం గ్రామ సర్పంచ్‌లు యు.లక్ష్మీమౌనిక, వడ్డి వెంకన్న ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ జరిగింది. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయి కిషోర్, ఎస్.లక్ష్మీ స్నేహలత తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు టీఎస్‌వీ నాగలక్ష్మి, బి.వరలక్ష్మి, వై.అరుంధతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి విచ్చేసిన గర్భిణులకు సీమంతాలు జరిగాయి. వైద్యాధికారులు కె.భాగ్యశ్రీ, బి.అనంత రామకృష్ణ, సీహెచ్ఓ ఎంఎస్ఎస్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్ఈఓలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, ఆర్ బాలామణి పాల్గొన్నారు.

కొత్తపేట: ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజారోగ్య పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అన్నారు. మండలంలోని అవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం పాఠశాల వద్ద 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదివ్య మాట్లాడుతూ ఆరోగ్య నియమాలు, పోషకాహారం, పిల్లలకు తల్లిపాల ప్రాముఖ్యత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య శిబిరాన్ని సర్పంచ్ ప్రారంభించారు. 114 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చంద్రకళ, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు

మామిడికుదురు: ఈదరాడ, నగరం గ్రామాల్లో సోమవారం ఉచిత వైద్య శిబిరాలు, సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఆరోగ్యవంతమైన మహిళ, శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా వీటిని ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల్లో నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యులు జాన్ లెవీ, సత్యవతి, గ్రామ సర్పంచ్‌లు జాలెం రమణకుమారి, చుట్టుగుళ్ల లక్ష్మి పాల్గొన్నారు. మహిళలు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక కూటమి, నేతలు, అధికారులు పాల్గొన్నారు

లింకు రోడ్ల ప్రతిపాదన ప్రభుత్వానికి నివేదిస్తాం

మామిడికుదురు: మార్కెట్ కమిటీ నిధులతో లింకు రోడ్లు నిర్మించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ పెనుమాల లక్ష్మి తెలిపారు. ఏఎంసీ కార్యాలయంలో సోమవారం జరిగిన పాలకవర్గం సమావేశానికి లక్ష్మి అధ్యక్షత వహించారు. దీనిపై సభ్యుల నుంచి వచ్చే ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి దీన్ని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీటితో పాటు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాల నిర్వహణ తదితర అంశాలపై కూడా సానుకూల నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జూలై, ఆగస్టు నెలల్లో మార్కెట్ కమిటీకి రూ.22 లక్షల ఆదాయం వచ్చిందని ఇన్‌చార్జి కార్యదర్శి జి.ప్రదీప్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ గుడాల వెంకటరమణ, పాల్గొన్నారు.



నగరం పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ లక్ష్మి

రెండు మండలాలను అమలాపురం డివిజన్‌లో కలపాలి

అంబాజీపేట: అంబాజీపేట, అయినవిల్లి మండలాలను అమలాపురం డివిజన్‌లో కలపాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టర్‌కు సోమవారం మాజీ ఎంపీపీ దాసరి వీరవెంకట సత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ రెండు మండలాలను కొత్తపేట డివిజన్‌లో విలీనం చేయడం వల్ల సుమారు 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, అమలాపురం డివిజన్‌లో అయితే ప్రజలందరికీ దగ్గరగా ఉంటుందని కలెక్టర్‌కు వివరించారు.

కొబ్బరి చెట్ల వేలంలో రూ.4.56 లక్షల ఆదాయం

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న కొబ్బరిచెట్లకు సోమవారం నిర్వహించిన వేలంపాటలో పంచాయతీకి రూ.4.56 లక్షల ఆదాయం సమకూరింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ టిళ్లపూడి నాగేశ్వరరావు సమక్షంలో డిప్యూటీ ఎంపీడీఓ ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వలీబాబా అధ్యక్షతన బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఐదు ప్రాంతాల్లో ఉన్న సుమారు 215 కొబ్బరిచెట్లకు మూడేళ్ల కాలానికి వేలంపాట జరిగింది. గతంలో ఈ పాట రూ.2.60 లక్షలు ఉండగా, ఈసారి రూ.4.56 లక్షల రికార్డు ధరకు వంగా వీరబాబు పాడుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కొత్తపేట: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పండించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ఐసీఆర్‌పీ శ్రీలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని బిళ్లకుర్రు శివారు కముజువారిపాలెంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహనలో భాగంగా ఆ విభాగం వానపల్లి యూనిట్ ఆధ్వర్యంలో అగ్నిఅస్త్రం కషాయం తయారు చేశారు. శ్రీలక్ష్మి రైతులకు దాన్ని తయారు చేసే విధానం, ప్రయోజనాలను వివరించారు. కాయతొలచు పురుగు, కాండం తొలచు పురుగు, ఆకుముడత పురుగు, వేరుపురుగు నివారణకు ఉపయోగపడుతుందని తెలిపారు. అలాగే నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఎంఎంటీ ప్రసాద్, యూనిట్ ఇన్‌చార్జ్ ప్రసాద్, రైతులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బిళ్లకుర్రులో కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి సిబ్బంది